# ప్రజాశక్తి



ఒకప్పుడు మగధ దేశాన్ని కుమారగుప్తుడు పరిపాలించేవాడు. అతని ఏలుబడిలో ప్రజలు చాలా సుఖంగా ఉండేవారు. కుమారగుప్తుడు ఉత్తముడు, పండితుడు, కళాప్రియుడు. ప్రజల నుండి పన్నుల రూపంలో వసూలు చేసిన డబ్బును తిరిగి ప్రజల కోసం వినియోగించడమే మంచిదని ఆయన అభిప్రాయం,

అతని అభిప్రాయాలు చాలా చిత్రంగా ఉండేవి.

''ప్రజలందరూ ఒకటే! వారి బాధలన్నీ ఒకటే! ఇంకెవరన్నా జోక్యం చేసుకుంటే తప్ప, ప్రజలు సౌఖ్యంగానే ఉంటారు. పాలకులు

వర్గాలను తెచ్చి పెడతారు. వైవమ్యాలను రెచ్చగొడతారు. ప్రజలు రెచ్చిపోతే సైన్యాన్ని నడుపుతారు'' అనేవాడు కుమారగుప్తుడు.

''ఈ కోటలు, బందిఖానాలు, రక్షకభటులు, సైనికులు, ఆయుధాలు, ఇవన్నీ క్రూరమృగాల నుండి కాపాడుకోవడానిక్కాదు; మనిషిని మరో మనిషి నమ్మక పోవడం వల్లనే వీటితో అవసరం కలుగుతున్నది. నాకు మానవుని మీద నమ్మకం ఉన్నది. మన రాజ్యంలోని సైన్యాన్ని రద్దుచేస్తున్నాను'' అన్నాడు కుమారగుప్తుడు.

అనడమే కాదు——

అలా చేశాడు కూడాను.

ఈ సంగతి పొరుగు రాజుకు తెలిసింది. ఆయనకు ఎంతో కాలంగా కుమారగుప్తుని రాజ్యం మీద కన్ను ఉంది! సైన్యాన్ని రద్దు చేసిన మూడవనాటికల్లా, శత్రురాజు తన బలంగతో మగధ మీదకు విరుచుకు పడ్డాడు.

ఈ సంగతి వేగుల ద్వారా తెలిసిన మంత్రి, కుమారగుప్తునితో మొర పెట్టుకున్నాడు.

''ప్రజలు సుఖంగా ఉండడమే నాకు కావాలి. ప్రజల పేరుతో, ప్రజల్లో ఒక భాగమైన సైన్యాన్ని యుద్ధరంగంలోకి దూకించడం నాకు ఇష్టం లేదు'' అన్నాడు కుమారగుప్తుడు.

శత్రురాజు సైన్యాలు రాజ్యాన్నంతా ఆక్రమించాయి. రాజధానిని చుట్టుముట్టాయి. కోట లోపలికి ప్రవేశించాయి. రాజును, రాజ బంధువులను బందీలను చేశాయి.

అంతదాకా నోరు మెదపకుండా ఉన్న ప్రజలు, ఈ దారుణాన్ని భరించ లేకపోయారు. తమ క్షేమం కోసం సైన్యాన్ని కూడా రద్దు చేసిన రాజు, ఆ ఖర్చును కూడా ప్రజా సంక్షేమం కోసం వినియోగించాలనుకొంటున్న రాజు, బందీ కావడమా? ఆయన సైన్యాన్ని రద్దు చేయక పోతే, శత్రురాజు సరిహద్దుల్లో కన్నా వచ్చేవాడా? ఇంతమంచి రాజు తమ అలసత్వం వల్లనే కదా బందీ అయ్యాడు? ఆయన్ను రక్షించ వలసిన బాధ్యత తమ మీద లేదా?

ఈ ఆలోచన కారుచిచ్చులా రాజ్యమంతటా వ్యాపించింది. ప్రజలు, చేతికందిన ఆయుధాలతో శత్రువుల మీద తిరగబడ్డారు. శత్రువుల సరఫరాలను దోచుకొన్నారు. వారిని సర్వనాశనం చేశారు. తమ రాజును విడిపించుకొన్నారు.

"నిర్బంధ పెట్టి నేను చేయించలేని పనిని ఉత్సాహంగా వారంతట వారే చేశారు. సైనిక శక్తికన్నా ప్రజాశక్తి ఎన్నడూ గొప్పదే! నా సిద్ధాంతం సరైనదా కాదా?" అన్నాడు కుమారగుప్తుడు.

మంత్రి 'నిజమే' నన్నట్టు తల పంకించాడు.

—o—